సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 9 । జనవరి । 2024



గంజాయి ముఠా అరెస్టు

గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు ఆదివారం రాత్రి నాగార్జున సాగర్ వద్ద అరెస్టు చేశారు. - 8లో



సమస్యల వలయంలో దర్గా

మత సామరస్యానికి ప్రతీక అయిన జాన్‌పహాడ్ దర్గా సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. - 10లో



పేదల రాజ్యం వచ్చింది

తెలంగాణ రాష్ట్రంలో పేదల రాజ్యం వచ్చిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో

ఎంపీ సీటుపై గురి

విజయం సాధించేందుకు పార్టీల వ్యూహాలు

- అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో జోరుమీదున్న కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ నేతలతో 13న భేటీకానున్న కేటీఆర్
- మోదీ చరిష్మాతో గట్టెక్కుతామని బీజేపీ భావన
- టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు



సాక్షి, యాదాద్రి: ప్రధాన రాజకీయ పార్టీలలో లోక్ సభ ఎన్నికల హడావుడి మొదలైంది. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయంతో కాంగ్రెస్ జోరు మీద ఉండగా.. ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా బీఆర్‌ఎస్ వ్యూహాలకు పదును పెడుతోంది. మరోవైపు మోదీ చరిష్మాతో బీజేపీ నాయకత్వం ముందుకు సాగుతోంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్లలో జనగామలో మాత్రమే బీఆర్‌ఎస్ గెలుపొందగా మిగతా చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్న పలువురు నాయకులు టికెట్ల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

విజయం కోసం తహతహ

ప్రధాని మోదీ చరిష్మానే నమ్ముకున్న బీజేపీ.. భువనగిరి ఎంపీ సీటును దక్కించుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షులను మారుస్తున్నట్లు ఇటీవల ప్రచారం జరిగినప్పటికి దాన్ని వాయిదా వేశారు. ఎన్నికల వేళ అధ్యక్షుల గోల ఎందుకని ప్రస్తుతం ఉన్న జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావునే కొనసాగిస్తున్నారు. టికెట్ ఆశిస్తున్న ఆయన ×విజన్ భువనగిరి₹ పేరుతో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరాముని అక్షింతల పంపిణీనితో ఓట్ల లబ్ది కోసం బీజేపీ దాని అనుబంధ సంస్థలు ఇంటింటికి వెళ్తున్నాయి. భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ కూడా బీజేపీ నుంచి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

పట్టు నిలుపుకునేందుకు..

భువనగిరి ఎంపీ సీటును దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్ కూడా కసరత్తు ప్రారంభించింది. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీఆర్‌ఎస్ విజయం సాధించింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయింది. అంతేకాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు స్థానాల్లో బీఆర్‌ఎస్ పరాజయం పొందింది. అయితే, సంస్థాగతంగా కొన్ని మార్పులు చేర్పుల ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ నెల 13న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి గుణపాఠ నేర్చుకుని లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు. కాగా, భువనగిరి ఎంపీ సీటును మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, పైళ్ల శేఖర్‌రెడ్డితోపాటు మరికొందరు నేతలు ఆశిస్తున్నారు.

కాంగ్రెస్‌లో జోష్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని కొనసాగించేందుకు పావులు కదుపుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించారు. నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భువనగిరి స్థానానికి సమన్వయకర్తగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియమించింది. అయితే, ఎంపీ టికెట్ కోసం కోమటిరెడ్డి కుటుంబం నుంచి ఒకరు టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మరికొందరు ఆశావహులు టికెట్ల వేటలో ఉన్నారు.

న్యూస్‌రీల్

మహాశివుడికి అభిషేకాలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వా అర్చన పూజలు విశేషంగా నిర్వహించారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను ప్రత్యేకంగా చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా, పూజారులు శ్రీస్వామి వారి ఆశీస్సులను అందజేశారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో వైభవంగా నిత్య కల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పూజలను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు.

ఫిబ్రవరి 28న సైన్స్ సెమినార్

భువనగిరి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 28న ఉపాధ్యాయులకు సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్ర సాంకేతిక విద్య పురోగమిస్తున్న భారత్ అనే ప్రధాన అంశంతో పాటు పాఠశాల విద్యలో స్టెమ్ పురోగతి, ప్రభావాన్ని అన్వేషించడం, సైన్స్ బోధనలో సృజనాత్మకత, ఆవిష్కరణలకు కేంద్రంగా పాఠశాల అనే ఉప అంశాలపై సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు. ఆసక్తి కలిగిన సైన్స్ ఉపాధ్యాయులు ఫిబ్రవరి 2వ తేది నాటికి tgscertmathsscience@gmail.com మెయిల్‌కు పంపాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి భరణి కుమార్ సెల్ : 9000989726 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



బాల్ల జశ్వంత్

రాజాపేట: రాజాపేట మండలం బొందుగుల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బాల్ల జశ్వంత్ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 22న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎంటీఆర్ మినీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బాల్ల జశ్వంత్ పాల్గొని ప్రతిభ కనపరచగా తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. రాజస్తాన్ రాష్ట్రంలోని బికనీర్‌లో ఈ నెల 10 నుంచి 15 వరకు నిర్వహించే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జశ్వంత్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జశ్వంత్‌కు పాఠశాల హెచ్‌ఎం అష్రఫ్ జానీ, పీఈటీ మధు, ఎస్‌ఎంసీ చైర్మన్ బాల్ల శ్రీశైలం, ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 1,242 దరఖాస్తులు

భువనగిరి టౌన్: ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా మొత్తం 1,242 దరఖాస్తులు వచ్చాయని అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు చివరి గడువు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఉన్నందున అర్హులైన పట్టభద్రులు అప్లై చేసుకోవాలని కోరారు.

డీసీసీబీలో డిపాజిట్ల సేకరణ మాసోత్సవాలు

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో జనవరి, ఫిబ్రవరి రెండు నెలలపాటు డిపాజిట్ల సేకరణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని డీసీసీబీలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాల తాకట్టుపై రూ.20లక్షల రుణ సదుపాయం కల్పిస్తున్నామని, గ్రాముకు రూ.4,500 వరకు రుణం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, రంగాచారి, అంజయ్య, అనురాధ, జయరాం పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి



వలిగొండలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

వలిగొండ : ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ (డేటా ఎంట్రీ) ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. సోమవారం వలిగొండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తులను ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్రెడ్డి, ఏఓ అంజనీదేవి, ఎంపీఓ కేదార్ ఈశ్వర్, ఆర్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, మనోహర్, కార్యదర్శులు, ఏఈఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఏఐటీయూసీ ప్రతినిధులు

భువనగిరి టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం కొత్త ప్రభుత్వమైనా మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇవ్వాలన్నారు. కోడి గుడ్లు, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, ఉపాధ్యక్షులు జిన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులపై ఉక్కుపాదం మోపాలి

- డీసీపీ రాజేష్ చంద్ర



మాట్లాడుతున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి క్రైం: నేరస్తులు, భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతూ పీడీ యాక్ట్ అమలు చేయాలని డీసీపీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల ఎస్‌హెచ్‌ఓలు, సీఐలతో సోమవారం భువనగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తులు రెండోసారి నేరం చేస్తే బెయిల్ రద్దు చేసి తిరిగి జైలుకు పంపాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను నిరోధించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు డయల్ 100కు అందించే సమాచారంపై సత్వరమే స్పందించాలని సూచించారు. నిందితులకు కోర్టులో శిక్షలు పడేలా చర్యలు చూడాలన్నారు.

ఓటర్ల సంఖ్య 6,45,385

ముసాయిదా జాబితా విడుదల

- పురుష ఓటర్ల కంటే స్త్రీలు 1,254 మంది అధికం
- ఫిబ్రవరి 8 తుది ఓటరు జాబితా



భువనగిరి టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు ముసాయిదా జాబితాను జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,45,385 మంది ఓటర్లు ఉన్నట్టు అధికారులు తేల్చారు. ఇందులో పురుష ఓటర్లు 3,22,055 మంది, స్త్రీలు 3,23,309 మందితోపాటు ఇతరులు21 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే స్త్రీలు 1,254 మంది ఎక్కువగా నమోదయ్యారు. ఓటరు జాబితాలను మండల కేంద్రాలు, గ్రామాల వారీగా అందుబాటులో ఉంచారు.

21 వరకు అభ్యంతరాల స్వీకరణ

ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 21వ తేదీవరకు తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందించాలి. ముసాయిదా జాబితాలో పేరు లేనివారు ఫారం–6లో వివరాలు నమోదు చేసుకొని ఆన్‌లైన్ ద్వారా గానీ, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను అందించాలి. ఈనెల 20, 21 తేదీల్లో ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. బీఎల్‌ఓలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు అందుబాటులో ఉంటారు. కొత్తగా పేరు నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రం మార్పు, పేర్లలో తప్పులుంటే వారి వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఓటరు నమోదు, సవరణల కోసం వచ్చిన దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ వరకు పరిశీలిస్తారు. 8వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
భువనగిరి	1,07,618	1,09,322	1	2,16,941
ఆలేరు	1,16,708	1,16,539	19	2,33,266
ఇతర నియోజకవర్గాల్లోని మండలాల్లో..				
చౌటుప్పల్ (మునుగోడు)	31,362	31,506	1	62,869
నారాయణపూర్ (మునుగోడు)	19,390	19,151	0	38,542
రామన్నపేట (నకిరేకల్)	22,342	21,841	0	44,183
మోత్కూరు (తుంగతుర్తి)	13,445	13,508	0	26,953
అడ్డగూడూరు (తుంగతుర్తి)	11,190	11,441	0	22,631
మొత్తం	3,22,055	3,23,309	21	6,45,385

• అప్‌డేషన్ కష్టాలు



భువనగిరిలోని ఎస్‌బీఐ కేంద్రం వద్ద సోమవారం ఆధార్ అప్‌డేషన్ కోసం బారులుదీరిన జనం

సకాలంలో సీఎంఆర్ అందించాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సాక్షి, యాదాద్రి: రైస్ మిల్లర్లు సకాలంలో ప్రభుత్వానికి సీఎంఆర్ అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సీఎంఆర్‌పై సమీక్షించారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి బియ్యం చేరవేసేలా చర్యలు తీసుకుటున్నట్లు తెలిపారు. అభయహస్తం కింద 5 గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను గడువులోగా ఆన్‌లైన్ చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఏ.భాస్కరరావు, జి.వీరారెడ్డి, డీపీఓ సునంద, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాచకొండ సీపీని కలిసిన ఎమ్మెల్యే కుంభం



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి క్రైం: భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడుతూ.. ప్రజలతో పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండేలా చూడాలని కోరారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

భువనగిరి టౌన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కరరావు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 27అర్జీలు వచ్చినట్టు పేర్కొన్నారు. జిల్లా అధికారులు ఒకరిద్దరు మినహా ఎవరూ హాజరు కాలేదు. ప్రజావాణికి వచ్చిన మండలం ప్రత్యేక అధికారులు వెళ్లి ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించడంతో కొందరు తిరిగి వెళ్లిపోయారు. దీంతో వారి కింది స్థాయి అధికారులు మాత్రమే ప్రజావాణిలో అందుబాటులో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి పాల్గొన్నారు.



వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారుల తరపున హాజరైన కిందిస్థాయి సిబ్బంది

ఆలేరులో ‘అవిశ్వాసం’ లొల్లి

- మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌కు వినతి
- తీర్మాన కాపీపై సంతకాలు చేసిన ఎనిమిది మంది కౌన్సిలర్లు

ఆలేరు రూరల్: ఆలేరు మున్సిపాలిటీలో అవిశ్వాసం లొల్లి మళ్లీ మొదలైంది. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వస్పరి శంకరయ్యపై అవిశ్వాసం పెట్టేందుకు పలువురు కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. చైర్మన్ పదవి నుంచి శంకరయ్యను తప్పించాలని కొన్ని రోజులుగా సొంతపార్టీలోని సభ్యులతోపాటు ప్రతిపక్ష సభ్యులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ మేరకు ఆయనపై అవిశ్వాసం పెట్టాలని తీర్మానం చేశారు. 12 మంది సభ్యులు కలిగిన మున్సిపల్ పాలకవర్గంలో అవిశ్వాస తీర్మాన నోటీసు కాపీపై ఎనిమిది మంది సభ్యులు సంతకాలు చేసి సోమవారం భువనగిరిలో కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు అందజేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఏడాది నుంచే ముసలం..

ఆలేరు మున్సిపల్‌లో 12 మంది సభ్యులకు గాను గత సంవత్సరం జనవరిలో 10 మంది సభ్యులు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. నోటీసుపై సంతకాలు చేసి సమావేశం జరపాలని గతంలోనే కలెక్టర్‌ను కోరారు. దీంతో అప్పట్లోనే చైర్మన్ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో అవిశ్వాస ప్రక్రియ ఆగిపోయింది. ఆ తర్వాత గతనెల డిసెంబర్ 18న ఐదుగురు కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి కలిసి ప్రజా సమస్యలు పట్టించుకోని మున్సిపల్ చైర్మన్‌పై ఫిర్యాదు చేశారు. మళ్లీ ఏడాది తర్వాత మున్సిపాలిటీలో ముసలం మొదలైంది.



ఆలేరు మున్సిపల్ కార్యాలయం

చైర్మన్ ఒంటెద్దు పోకడలతోనే..

చైర్మన్ ఒంటెద్దు పోకడ పోతున్నారని, వివిధ వార్డుల్లో నెలకొన్ని సమస్యలు పరిష్కరించడం లేదని, దీంతో తాము ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని కౌన్సిలర్లు అంటున్నారు. చైర్మన్ తన నాలుగేళ్ల పదవి కాలంలో మున్సిపల్ ఎజెండా విషయంపై కౌన్సిలర్లతో చర్చించలేదంటున్నారు. అభివృద్ధిని పట్టించుకోవట్లేదని పలువురు సభ్యులు చైర్మన్‌పై ప్రత్యక్షంగానే ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్టు తెలుస్తోంది. అయితే ఈ అవిశ్వాస తీర్మాన విషయంపై ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జోక్యం ఉంటుందా లేదా అనేదానిపై ఆలేరులో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే కొందరు మాత్రం ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లను ఎమ్మెల్యే తన వైపు తిప్పుకునే ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు.

మున్సిపాలిటీలో పార్టీల బలాబలాలు

బీఆర్‌ఎస్ సభ్యులు (చైర్మన్‌తో సహా)	09
కాంగ్రెస్ పార్టీ	02
బీజేపీ	01
మొత్తం సభ్యులు	12

అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌ను కలిసి కౌన్సిలర్లు



కలెక్టర్‌కు ఇచ్చే అవిశ్వాస పత్రాన్ని చూపుతున్న కౌన్సిలర్లు

భువనగిరి టౌన్: ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్యపై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ పలువురు కౌన్సిలర్లు సోమవారం జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు తీర్మానం నోటీసు అందజేశారు. మళ్లీ ఎనిమిది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి సోమవారం కలెక్టర్‌కు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి అవిశ్వాసానికి తేది నిర్ణయిస్తామని తెలిపారు. నోటీసు అందించిన వారిలో కౌన్సిలర్లు గుత్తా శమంతరెడ్డి, సంగు భూపతి, బేతి రాములు, కందుల శ్రీకాంత్, కౌన్సిలర్లు భర్తలు రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పెద్దవూర: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సంక్రాంతి పండుగ లోపు చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు అన్ని రిలీజ్ చేయటానికి సీఎం ఆదేశాలు ఇవ్వడంతో కాంట్రాక్టర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పెద్దవూర మండలంలోని వెల్మగూడెం గ్రామానికి చెందిన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ దాచిరెడ్డి వెంకటనర్సింహారెడ్డి (డీవీఎన్‌రెడ్డి), ఎస్ఎన్‌రెడ్డి, సీనయ్య, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య ప్రాణ ప్రతిష్ఠకు ఆహ్వానం



రామానంద ప్రభూజీకీ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

బొమ్మలరామారం: మండలంలోని పెద్ద పర్వతాపూర్ గ్రామంలో గల శ్రీసాయిధామం ఆశ్రమం సాయి దత్త పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీకి అరుదైన గౌరవం దక్కింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవానికి ఉమ్మడి జిల్లాలోనే రామానంద ప్రభూజీ ఒక్కరికే ఆహ్వానం అందింది. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు సోమవారం సాయిధామంలో రామానంద ప్రభూజీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ సహ కార్యదర్శి తోట భాను ప్రసాద్, జిల్లా కోశాధికారి చామ రవీందర్, కార్యదర్శి సాల్వేరు వేణు, కోకల సందీప్, పూస శ్రీనివాస్, బొమ్మకంటి మల్లేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలగాని వెంకటేష్ గౌడ్, రంగా రామాగౌడ్, సర్పంచ్ రెడ్డబోయిన లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

గంజాయి రవాణా ముఠా అరెస్టు

- రూ.84లక్షల విలువైన 336 కేజీల గంజాయి స్వాధీనం
- కూరగాయల పెట్టెల్లో తరలిస్తుండగా పట్టివేత
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందనా దీప్తి



నిందితులు, గంజాయిని చూపుతున్న పోలీసులు

నల్లగొండక్రైం, నాగార్జునసాగర్: గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.84లక్షల విలువైన 336 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను సోమవారం నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ నుంచి డీసీఎంలో గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు నాగార్జునసాగర్‌లోని విజయపురి నార్త్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంపత్ తన సిబ్బందితో కలిసి రాష్ట్ర సరిహద్దు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కూరగాయల లోడ్‌తో వెళ్తున్న డీసీఎంను ఆపారు. ఆ డీసీఎంలోని కూరగాయల ట్రేల అడుగున 168 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో డీసీఎంలోని నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు.

ముఠాగా ఏర్పడి..

మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాకు చెందిన జ్ఞానోబా అమోల్ ఘెరే, సంగమేశ్వర సదా శివ జంగనే, ఖయ్యూమ్ ఇషాకే, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు చెందిన గణపతి బసవరాజు సోనాల్ ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేయడం మొదలుపెట్టారు. జ్ఞానోబా అమోల్ ఘెరే డ్రైవర్‌గా పని చేస్తుండగా.. అతడికి నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన జయపాల్ పరిచయమయ్యాడు. వీరంతా కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలించాలని నిర్ణయించుకున్నారు. వరంగల్ మీదుగా వెళ్తే పట్టుబడతామని గుంటూరు, మాచర్ల మీదుగా డీసీఎంలో కూరగాయల లోడు మధ్యలో గంజాయి పెట్టుకొని తరలిస్తుండగా.. పోలీసులకు సమాచారం అందడంతో పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల్లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన జయపాల్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. గంజాయి రవాణాపై మరింత నిఘా పెట్టి కట్టడి చేస్తామని ఎస్పీ తెలిపారు.

భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



భూసార పరీక్షా యంత్రాన్ని ప్రారంభిస్తున్న వీరేశం, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్

నకిరేకల్: భూసార పరీక్షా యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు ఎర్త్ ట్యూన్స్ డిజైన్, ఏఎస్‌సీఏ వారి సహకారంతో నకిరేకల్‌లో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం భూసార పరీక్షా యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు షూ అందజేసి మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ద్వారా తక్కువ మందులతో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలను పండించుకోవచ్చన్నారు. అనంతరం నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం కోసం నాబార్డు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఐఆర్‌డీఎస్ సొసైటీ అధ్యక్షుడు వాడపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, స్థానిక వార్డు కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, బానోతు వెంకన్న, చౌగోని రజితాశ్రీను, సీఎస్‌ఏ ప్రతినిధి వి. రాంమూర్తి, రైతు ఉత్పత్తిదారులు సంస్థ వైస్ చైర్మన్ భూపతి సైదమ్మ, కట్టంగూరు రైతు ఉత్పత్తిదారుల చైర్మన్ సీహెచ్. సైదమ్మ, సీఈఓ లక్ష్మణ్, డైరెక్టర్లు శ్రీనివాస్, భిక్షమయ్య, యంపల్ల దశరథరెడ్డి, సైదులు, భూపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన

హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్‌లోని సువర్ణ గార్డెన్‌లో గర్భిణులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు మానసిక ప్రశాంతత కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మీనగేష్, సేవాసమితి ప్రతినిధులు పెండెం స్వర్ణలత చంద్రశేఖర్, దొంగరి సోమయ్య, కోనేటి యాదయ్య, నాగులు, నగేష్ తదితరులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి బలవన్మరణం



శ్రీరాములు (ఫైల్)

రామన్నపేట: జీవితంపై విరక్తితో రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రామన్నపేట శివారులో వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రామన్నపేటకు చెందిన బొడ్డు శ్రీరాములు(52) మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం సాయంత్రం మద్యం తాగి వచ్చిన శ్రీరాములును కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో శ్రీరాములు ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం రామన్నపేట–వలిగొండ రైల్వేస్టేషన్ల మధ్య కీ మ్యాన్ ట్రాక్ చెక్ చేస్తుండగా 48/8–9పోల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడం గమనించి రైల్వే అధికారులకు సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని శ్రీరాములు మృతదేహంగా గుర్తించారు. జీవితంపై విరక్తితో గుర్తుతెలియని రైలుకింద పడి శ్రీరాములు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ కె. సాలకమ్మ తెలిపారు.

శబరిమలలో తుమ్మలపెన్‌పహాడ్ వాసి మృతి



లింగయ్య (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): శబరిమలకు వెళ్లిన ఆత్మకూర్(ఎస్) మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ వాసి గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఉయ్యాల లింగయ్య(37) సూర్యాపేటలోని ఖమ్మం క్రాస్ రోడ్డు సమీపంలో వాటర్ ప్లాంట్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గత పదేళ్లుగా అయ్యప్ప మాల వేస్తున్న లింగయ్య ఈ ఏడాది కూడా మాల ధరించాడు. ఆదివారం సూర్యాపేట నుంచి 9మంది మాలధారులు హైదరాబాద్‌కు చేరుకుని అక్కడి నుంచి విమానంలో కేరళ రాష్ట్రంలోని కొచ్చి ఎయిర్‌పోర్ట్‌లో దిగి కాలినడకన పంబాకు బయల్దేరగా లింగయ్య రాత్రి 8 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. సహచరులు సీపీఆర్ చేసినప్పటికీ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉపేంద్రతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కనీస వేతనం చెల్లించకపోవడం బాధాకరం

- నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారీ సభ్యుడు పీ.పీ. వావా



సమావేశంలో మాట్లాడుతున్న పీ.పీ. వావా

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమని నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారీ సభ్యుడు పీ.పీ. వావా అన్నారు. సోమవారం మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాలోని అన్ని మున్సిపల్ శాఖ కమిషనర్లతో జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సఫాయి విముక్తి చట్టం–2022 కింద సఫాయి కార్మికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని, మున్సిపల్ కమిషనర్ల వద్ద పూర్తిస్థాయి సఫాయి కార్మికుల సమాచారం లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి స్కాలర్‌షిప్‌లను కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యకు కేంద్రం అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సఫాయి కార్మికులకు దళితబంధు ఏ మేరకు ఇచ్చారో తెలుసుకున్నారు. కార్మికులకు తప్పనిసరిగా మూడు జతల యూనిఫాం, గ్లౌజులు తదితర వస్తువులు సకాలంలో అందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై కార్మికులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడ్వైజర్ గిరింద్రనాథ్‌జీ, సోషల్ వెల్ఫేర్ ఈడీ శ్రీనివాస్, ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ వెంకటగిరి, మున్సిపల్ కమిషనర్లు పూర్ణచందర్, వెంకటయ్య, వీరారెడ్డి, కిరణ్, బాలాజీ, రాందుర్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఆర్డీఓ చెన్నయ్య తదితరులున్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

- అనంతరం తానూ పొడుచుకున్న నిందితుడు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

చివ్వెంల(సూర్యాపేట): భార్యపై అనుమానంతో భర్త ఆమెపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన కప్పల శ్రీనుకు ఆత్మకూర్(ఎస్) మండల రామన్నగూడెం గ్రామానికి చెందిన స్వప్నతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. 6 సంవత్సరాల క్రితం చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులో సొంతంగా ఇళ్లు నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. శ్రీను ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, స్వప్న ఇంట్లోనే ఉంటుంది. కొంతకాలంగా స్వప్నను శ్రీను అనుమానంతో వేధిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన శ్రీను భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో శ్రీను అక్కడే ఉన్న కత్తితో స్వప్నపై దాడి చేసి, కత్తితో పొడిచాడు. అనంతరం అదే కత్తితో తాను పొడుచుకున్నాడు. వెంటనే 108కు శ్రీను సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది ఇద్దరిని సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. స్వప్న పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. స్వప్న తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను హత్య చేసేందుకు సుపారీ

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

కోదాడరూరల్: భూ తగదాల నేపథ్యంలో ఓ మహిళను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చిన వారితో పాటు తీసుకున్న వారిని కోదాడ పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోదాడ పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం కట్టకమ్ముగూడేనికి చెందిన వేమూరి నవీన్, రంగిశెట్టి నరసింహారావుకు వేమూరి సుధాకర్‌తో కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సుధాకర్ భార్య లక్ష్మిని హత్య చేసేందుకు నవీన్, నరసింహారావు కోదాడ పట్టణానికి చెందిన గుంజా జ్ఞానరాజు అలియాస్ గణేష్, కట్టెమని యశ్వంత్‌కు రూ.60వేలు సుపారీకి ఇచ్చారు. గత నెల 7వ తేదీన సుధాకర్ భార్య లక్ష్మి కట్టకమ్ముగూడెం రోడ్డులో వాకింగ్‌కి వెళ్లి వస్తుండగా జ్ఞానరాజు, యశ్వంత్ బైక్‌పై వెళ్లి ఆమెను కర్రలతో తీవ్రంగా కొట్టి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు కోదాడ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాల్ లిస్ట్, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా సుపారీ ఇచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో నవీన్, గణేష్, యశ్వంత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా నరసింహారావు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



రైల్వే స్టేషన్‌లో దీక్ష చేస్తున్న కార్మికులు

నల్లగొండ రూరల్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతు సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సౌత్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. కార్మికులు ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డి మాట్లాడుతూ నూతన పెన్షన్ స్కీమ్‌తో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వీరారెడ్డి, బీఎస్ఎన్ఎల్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, సాంబశివరావు, నాగిరెడ్డి, రాంభద్రారెడ్డి, వెంకటేష్, గంగరాజు, మధు, వీరబాబు, సాయిరాం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై ఎద్దు మృతి

చౌటుప్పల్: పాముకాటుకు గురై ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు.. తంగడపల్లి గ్రామానికి చెందిన రైతు అంతటి ఈశ్వరయ్య తన ఎద్దును పొలం వద్ద కట్టేయగా.. పాముకాటుకు గురై సోమవారం మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్ షా



ప్రతిజ్ఞ చేస్తున్న నవీన్‌కుమార్ షా, అధికారులు

బీబీనగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్ షా అన్నారు. బీబీనగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, వ్యాపారస్తులచే 2047 నాటికి అభివృద్ధి చెందిన స్వావలంబన భారతదేశంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు వినియోగించుకొని తమ జీవన ప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. అనంతరం కేంద్ర పథకాలతో లబ్ధి పొంది ఆర్థిక అభివృద్ధి సాధించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీరామకృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ స్వాతి, ఏపీజీవీబీ మేనేజర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు దొంగల బెడద

- కరెంట్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, బైక్‌లు దొంగిలిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు
- గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్న ప్రజలు



బొర్రాయిపాలెం రోడ్డు వెంట దుండగులు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్లు

త్రిపురారం: గ్రామాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద కరెంట్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు బైక్‌లు దొంగిలిస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పొలాలకు సాగు నీరు లేకపోవడంతో రైతులు బావులు, బోర్ల కింద పంటలను సాగు చేసుకోవడానికి విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, సర్వీస్ వైర్లను దొంగిలిస్తున్నారు. మండలంలోని మెట్ట ప్రాంతాలలో సాగు చేస్తున్న బత్తాయి, నిమ్మ, ఆయిల్ పామ్, కూరగాయల తోటల్లో సైతం డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు కూడా దొంగిలిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాలు, పల్లెల్లో రోడ్లు, ప్రధాన వీధుల వెంట ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను సైతం పగులగొట్టి అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ను కూడా దొంగిలిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆటోల్లో గుంపులుగా వచ్చి దొంగతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి వేళ రైతులు ఒంటరిగా వ్యవసాయ పొలాల వద్ద తారసపడినా దాడులకు దిగుతున్నట్లు సమాచారం. మండల కేంద్రంలో పలు దుకాణాల్లో కూడా దొంగతనాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ దొంగతనాలను అరికట్టాలంటే గ్రామాల్లో పోలీసులు రాత్రి వేళ పెట్రోలింగ్ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాపర్ వైరు దొంగిలిస్తున్నారు

మండలంలోని రాజేంద్రనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బొర్రాయిపాలెం వెళ్లే దారిలో రెండు రోజుల క్రితం రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి ఆయిల్, కాపర్ వైరును దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఎక్కువగా కాపర్ వైరు దొంగిలిస్తున్నారు. దీంతో విద్యుత్ శాఖకు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. గ్రామాల్లో ఇటీవల జరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.

– రవీందర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ, త్రిపురారం

మూడుసార్లు చోరీ చేశారు

వ్యవసాయ పొలాల అవసరాల నిమిత్తం కెనాల్ వద్ద వేసుకున్న 3 మోటర్లు, కేబుల్‌ను మూడుసార్లు దొంగలు దొంగిలించారు. వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, స్టార్టర్లను దొంగిలిస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. తిరిగి మోటార్లు వేసే సరికి పొలాలు ఎండిపోతున్నాయి. చోరీలకు పాల్పడుతున్న దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి.

– గంగుల రేణుకాశ్రీనివాస్, ఉప సర్పంచ్, బాబుసాయిపేట

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి కోదాడ మండలంలోని రెడ్లకుంట మీదుగా టిప్పర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా కాపుగల్లు వద్ద పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.